విశాలాంధ్ర
ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి
సోమవారం 03 ।మార్చి। 2025 8 పేజీలు

రైతాంగానికిచ్చిన హామీలు అమలు చేయాలి

- కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి
- రైతుల పంటలు కొనుగోలు చేయాలి...
- మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలి
- 5న ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం పిలుపు

విశాలాంధ్ర - ఏలూరు : కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని, తదితర రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా జరుగుతున్న జిల్లా కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. ఆదివారం ఏలూరు అన్నే భవనంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి సమావేశం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో బి.కె.యం.యు. జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే,జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు తదితరులు మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పి రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు బదులు మరింత ప్రమాదకర కొత్త చట్టాలు తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే వ్యవసాయ మార్కెట్లను ప్రైవేటీకరించేందుకు జాతీయ వ్యవసాయ మార్కెట్ ఫ్రేమ్ వర్క్ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నారని దీనివలన భవిష్యత్తులో రైతులు మద్దతు ధరలు కోల్పోతారని చెప్పారు.మరోవైపు నూతన సహకార చట్టం పేరుతో సహకార సొసైటీలను, పాల డైయిరీలను, మత్స్యకార సొసైటీలను,మొత్తం సహకార వ్యవస్థను నాశనం చేసే విధానాలను ▶మిగతా 2లో

సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో త్వరలో భూ పోరాటం

- కొమరగిరి లేఅవుట్‌లో ఇల్లు లేని పేదలకు మూడు సెంట్లు భూమి ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఇల్లు లేని నిరుపేదలకు మూడు సెంట్లు భూమి కొత్తపల్లి మండలం కొమరగిరి లేఔట్‌లో స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. కొమరగిరిలో ఉన్న రామాలయం శెట్టిబలిజిపేట తుఫాన్ బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు దరఖాస్తులు వ్రాయడం జరిగింది. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ గత ఎన్నికల రెండు నెలల ముందు అప్పటి ప్రభుత్వం కొమరగిరి పంట పొలాలను ఎకరం 50 లక్షలు చొప్పున 72 ఎకరాలు 36 కోట్లకు కొనుగోలు చేశారన్నారు. చాలామందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి స్థలం చూపించలేదని ఎన్నికల అనంతరం ఆ భూమి పై కొంతమంది భూ కబ్జాదారులు కన్ను పడిందన్నారు. జనం కోసంమే కొన్న ఆ భూమిని జనం కోసమే ఉపయోగించాలని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ నాయకత్వంలో సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటం చేస్తామని మధు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కే బోడకొండ, పిఠాపురం కార్యదర్శి శాఖ రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్క శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు మేడిశెట్టి వీరబాబు, రాముడు బాల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జెవి సత్యనారాయణమూర్తి అరెస్టు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - ఏలూరు : ఎల్.జి. పాలిమర్స్ పేలుడు సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జే.వి. సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సీపీఐ శ్రేణులు ఆందోళన చేసిన సందర్భంలో పెట్టిన కేసులో కోర్టుకు హాజరు కాలేదన్న కారణంతో సత్యనారాయణమూర్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న కమ్యూనిస్టు నాయకులను నేరస్తుడి మాదిరిగా అరెస్టు చేయడం దుర్మార్గం అని పేర్కొన్నారు.అరెస్టు తీరు సక్రమమైన పద్ధతిలో లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పూనుకోవడం సరైన చర్య కాదన్నారు.గత వైసిపి పాలనలో ఇటువంటి అక్రమ కేసులు బనాయించిన కారణంగానే ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపారని,గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కూడా కక్ష సాధింపు చర్యలు చేపడితే వైసీపీకి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.తాము అధికారంలోకి వస్తే వైసిపి ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులన్నీ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.అక్రమంగా అరెస్టు చేసిన సత్యనారాయణ మూర్తిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారుల అభివృద్ధికి చర్యలు
- కేంద్రమంత్రి శ్రీనివాసశర్మ 8లో

పది విద్యార్థులపై కార్పొరేట్ కన్ను



- పరీక్షలు రాయకముందే అనధికార అడ్మిషన్లు
- తమ కళాశాలలోనే చేర్పించాలని ఫోన్ల ద్వారా ఒత్తిడి
- ముందే చేర్పిస్తే రాయితీలు ఇస్తామంటూ హామీ

పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉన్నట్లయితే వారి తల్లిదండ్రులు గత నెల రోజుల నుంచి కార్పొరేట్ విద్యావ్యవస్థల మాయాజాలంలో పడి తమ పిల్లల భవిష్యత్తు కోసం తలలు పట్టుకుంటున్నారు.కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ఇంటర్లో మంచి మార్కులు రావాలంటే,మీ పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలంటే తప్పనిసరిగా మా కళాశాలలోనే చేర్పించాలని రంగురంగు బ్రోచర్లతో అందమైన వలను ఎరవేస్తున్నారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కాకముందే ఈ తరహా కార్పొరేట్ మోసాలకు సామాన్య తల్లిదండ్రులు బలవుతున్నారు.

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : కార్పొరేట్ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని, ప్రత్యేక హాస్టల్ వసతితో పాటు అధునాతన ఉత్తమ బోధన సిద్ధాంతం, ఏసీ తరగతులు, చదువుతోపాటు ఉన్నత విద్యకు అందించవలసిన అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, వీటితో పాటు క్రీడలలో కూడా విద్యార్థులను రాణించే బాధ్యత మా కళాశాలది అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు,తల్లిదండ్రుల వివరాలని పదవ తరగతి స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా సేకరించి, మారుమూల ఉన్న గ్రామీణ ప్రాంతాలలో చదువుతున్న విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులను కూడా పిఆర్వోల ద్వారా సంప్రదిస్తున్నారు. అన్ని గ్రామాలలో వందల పాఠశాలలలో వేలమంది విద్యార్థుల వివరాల సేకరించి వారిలో బాగా చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రు లకు వల వేస్తూ వారిని మా కళాశాలలో ఉంచాలని ఒత్తిడి తీసుకొస్తూ.. గ్రామాలలో ర్యాంకులు సాధించే విద్యార్థులను పట్టుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

విద్యావ్యవస్థ నియమాలకు తూట్లు....

కార్పొరేట్ కళాశాల వ్యవస్థలు విద్యావ్యవస్థ నియమాలను తుంగలో తొక్కుతున్నాయి.సాధారణంగా పదవ తరగతి పరీక్షలు అయిన తరువాత ఫలితాల అనంతరం ఇంటర్ ప్రవేశాలు ప్రారంభించాలి. ఆ నియమాలను గాలికి వదిలేసి ఇంకా 6 నెలల సమయం ఉండగానే ప్రవేశాలు ప్రారంభిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసపుచ్చుతున్నారు.విద్యార్థుల భవిష్యత్తుపై కార్పొరేట్ కబంధహస్తాల మధ్య నలిపివేయడానికి పథకాలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పుడు మాత్రం కళాశాలలో ప్రత్యేక వసతులు ఉన్నాయని,హాస్టల్ వసతులు చాలా బాగున్నాయని చెబుతారు.కానీ వాస్తవ పరిస్థితులలో హాస్టల్లో విద్యార్థినులకు ఎటువంటి వసతులు లేవని,బాత్ రూములు కూడా సరిగా లేవని మహిళా కమిషన్ లే తెలిపిన ఏమీ చేయలేని ▶మిగతా 2లో

రంజాన్ మాసం ప్రారంభం

విశాలాంధ్ర - లింగపాలెం : ముస్లింలకు పవిత్ర మాసమైన రంజాన్ ఉపవాస ప్రార్థనలను ఆదివారం మొదలుపెట్టారు. నెల పొడుపు పొడవడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. రంజాన్ మాసం ముగిసే వరకు ముస్లిం సోదరులు ప్రతిరోజు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఆహారం,నీరు ముట్టకుండా భక్తిశ్రద్ధలతో ఉంటారు. ఖురాన్ ఈనెలలో అవతరించిందని ఉపవాస ప్రార్థన వల్ల ప్రతి వారిలో ఓర్పు,సహనం అలవడుతోందని దీనివల్ల భక్తి భావం పెరుగుతుందని ముస్లిం మత బోధకులు ప్రసంగించారు. రంజాన్ ప్రాముఖ్యతను మత బోధకులు వివరించారు. ప్రజలంతా ఒకరికొకరు ప్రేమ, దయతో జీవించాలని తెలిపారు. 40 రోజులపాటు చేసే ఉపవాస ప్రార్థనల వల్ల ఆధ్యాత్మికత పెరుగుతుందని వివరించారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరులు మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నలుగురు వ్యక్తులపై కేసు నమోదు

విశాలాంధ్ర- టి నరసాపురం : కోడి పందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లుగా హెడ్ కానిస్టేబుల్ ఎం రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అప్పలరాజు గూడెం గ్రామ శివార్లలో డబ్బులు పణంగా పెట్టి కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో ఆదివారం దాడి చేసి నిర్వాహకుల నుండి 2100 నగదు, కోడి పుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లుగా ఆయన తెలిపారు.

ముగిసిన శివరాత్రి మహోత్సవాలు

భక్తులకు అన్న సమారాధన

విశాలాంధ్ర- ఉంగుటూరు : మహాశివరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఉంగుటూరు మండలం నారాయణపురం శివాలయంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు సోదరుడు భీమరాజు అన్నసమా రాధన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు భోజనాలు వడ్డించారు. తొలుత స్వామివారి దర్శించుకుని పూజలు చేశారు. నిడమర్రు డిప్యూటీ తాహసిల్దార్ దుర్గాప్రసాద్, ఆలయ నిర్వాహకులు బొద్దేపల్లి అప్పారావు వచ్చిన భక్తులకు తగిన ఏర్పాటు చేశారు.

కార్పొరేట్ కన్ను

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు కార్పొరేట్ విద్యావ్యవస్థలతో పోటీ పడలేక తమ పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యా విధానంలోకి వెళితే ఇంటర్ పరీక్షలో బైపిసి, ఎంపీసీలో ల్యాబ్ ద్వారా ప్రాక్టికల్స్ చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న కళాశాలలో ఎటువంటి ప్రాక్టికల్స్ లేకుండానే ఇంటర్ విద్యార్థులకు పూర్తి మార్కులు వేస్తూ వారి భవిష్యత్తును అంధకారంగా మారుస్తున్నారు. ప్రభుత్వ నియమాకాల ప్రకారం ఫీజుల పట్టికను గాలికి వదిలేసి రూ.2 లక్షల నుంచి రూ.3,5 లక్షలు ప్రత్యేక ప్యాకేజీలు అంటూ తల్లిదండ్రుల స్థాయిని బట్టి దోపిడీకి తెరతీస్తున్నారు. విద్య పేరుతో ఎంత దోపిడీ జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలు కూడా చేయకపోగా వారి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కార్పొరేట్ కళాశాలలో తమ అంగ బలం,అర్థ బలంతో అధికారులకు మామూలు చేరవేస్తూ,అధికార బలంతో అంటకాగుతూ విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు అవగాహన తప్పనిసరి...

పదో తరగతి నుండి ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు ఏ రంగం వైపు మొగ్గు చూపుతారో వారి సామర్థ్యాన్ని బట్టి ఆ భవిష్యత్తు నిర్ణయమై ఉంటుంది.ప్రతి తల్లిదండ్రులు విద్యపై అవగాహన కలిగి తమ పిల్లల భవిష్యత్తు కోసం ఉన్నత విద్యావంతుల సలహాలు తప్పనిసరిగా తీసుకొని తీర్చిదిద్దే విధంగా అవగాహన పెంచుకోవాలి.కార్పొరేట్ సంస్థల వలలో పడి జేబులు ఖాళీ చేసుకోకుండా తమ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని విద్యావంతులు సలహా ఇస్తున్నారు. జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థల మాయాజాలంపై తప్పనిసరిగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

రూపొందిస్తున్నారని ఇది రైతాంగానికి అత్యంత ప్రమాదకరమన్నారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును యధావిధిగా అమలు చేస్తూ వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని, భవిష్యత్తులో రైతులు ఉచిత విద్యుత్ కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు కోరుతున్న చట్టాలు కాకుండా కార్పొరేట్ కంపెనీలు కోరుతున్న చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు.వ్యవసాయ కార్పొరేటీకరణ విధానాలు ఆపి కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.రైతులు కష్టపడి పండించిన పంటలకు మార్కెట్ లో కనీస ధరలు రావడంలేదని, మిర్చి,పత్తి, కొబ్బరి,కోకో, వైట్ బర్లీ పొగాకు ,పెసలు, మినుములు వంటి పంటలను ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిష్కారం అమలు చేయాలన్నారు. కార్మికు వ్యతిరేక నాలుగు లేబరు కోడ్ లను రద్దు చేయాలన్నారు. రైతాంగ,కార్మిక,ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలని, కేంద్ర,రాష్ట్ర బడ్జెట్ లలో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కలిదిండి వచ్చే వాహనాలు దారి మళ్లింపు

విశాలాంధ్ర - కలిదిండి : మేరీ మాత ఉత్సవాల సందర్భంగా వాహనాలను దారి మళ్లిస్తు న్నట్లు ఎస్సై వి. వెంకటేశ్వర ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు గుడివాడ నుంచి భీమవరం వెళ్ళు వాహనాలు కోరుకొల్లు నుంచి కైకలూరు మీదగా భీమవరం వెళతాయని, భీమవరం నుంచి గుడివాడ వెళ్లే వాహనాలు ఉప్పుటేరు వద్ద నుంచి సున్నంపూడి మీదగా కైకలూరు గుడివాడ వెళ్తాయని తెలిపారు. చిన్న వాహనాలు బస్టాండ్ వద్ద నుంచి కోట కలిదిండి మీదుగ భోగేశ్వరం వెళ్లే ఆర్చి వద్ద మెయిన్ రోడ్‌కు మళ్ళించా మన్నారు. ఉత్సవాలు వలన వాహనదారులు ఇబ్బందులకు గురి కాకూడదని దారి మళ్లించినట్లు ఆయన తెలిపారు.

పోతన అప్పారావుకు సహచరుల పరామర్శ

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న సిపిఐ సీనియర్ నాయకుడు పోతన అప్పారావును ఆయన సహచరులు సిపిఐ జిల్లా నాయకుడు టీవీఎస్ రాజు, సబ్బి రమేష్ పరామర్శించారు. ఆదివారం ఆయన అనారోగ్యం గురించి తెలుసుకుని జంగారెడ్డిగూడెంలోని ఇంద్రజిత్తుగుప్తా నగర్‌లోని పోతన అప్పారావు నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా పార్టీ కార్యదర్శిగా సుదీర్ఘకాలం సేవలందించిన ఆయన తొందరలోనే పూర్తి ఆరోగ్యవంతునిగా పార్టీ శ్రేణులతో సన్నిహితులతో తిరిగి మళ్లీ యధావిధిగా కార్యకలాపాలను కొనసాగిస్తారని సిపిఐ నాయకులు టీవీఎస్ రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఎస్‌టియు అభినందనలు

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : నూజివీడులో జరుగుతున్న బాలోత్సవం కార్యక్రమంలో ఆగిరిపల్లి మండలానికి చెందిన విద్యార్థులు విచిత్ర వేషధారణతో అందరిని ఆకట్టుకున్నారు. బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను ఆగిరిపల్లి మండల విద్యాశాఖ అధికారి 2 కే అనంద్ కుమార్, ఉపాధ్యాయులు మక్కే వేణుగోపాలరావు,పి.వీరకోటి స్వయంగా వీక్షించి వేషధారణలతో ప్రేక్షకులను అలరించిన విద్యార్థులను అభినందించారు.

జనసేన పార్టీలోకి చేరికలు

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలోని, సినీ నిర్మాత గవర ఉదయ శ్రీనివాస్ (బన్నీ వాసు) అతిథి గృహంలో రాష్ట్ర ప్రచార విభాగం చైర్మన్ బన్నీ వాసు పర్యవేక్షణలో, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఆదివారం పలువురు జనసేన పార్టీలో చేరారు. వారికి నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మండెల రజిని తోపాటు పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బోణం చినబాబు, పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర, జిల్లా ప్రచార విభాగం కో ఆర్డినేటర్ తులా రామలింగేశ్వరరావు, యలమంచిలి మండలం అధ్యక్షులు కొడవటి వర బాబు, పోడూరు మండలం అధ్యక్షులు పితాని వెంకటేష్, జిల్లా ఐటీ కో ఆర్డినేటర్ సాధనాల దుర్గాబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శులు ఉన్నమట్ల ప్రేమ్ కుమార్, షేక్ వల్లీ, నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమం ఆసుపత్రికి ఉచిత బస్సు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : సామాజిక బాధ్యతగా రోగులకు ఆశ్రమం ఆసుపత్రి యాజమాన్యం ఉచిత బస్సు సదుపాయం కల్పించడం అభినందనీయమని ఐఎంఏ జంగారెడ్డిగూడెం అధ్యక్షులు డాక్టర్ కాకర్ల రామచంద్ర బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు ఆశ్రమం ఆసుపత్రికి ఏర్పాటు చేసిన ఉచిత బస్సు ప్రతిరోజు ఉదయం ఏడున్నర గంటలకు బయలుదేరుతున్నారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు,ఆశ్రమం సీఈవో రాజ రాజన్, క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెన్మత్స రంగరాజు స్థానిక నాయకులు గొట్టుముక్కల భాస్కర్ రాజు,ఇందుకూరి వెంకటసుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో... మరో మలుపు

- ఇరిగేషన్ శాఖదే బాధ్యతట.
- కొత్త ఐడియా ఇచ్చిందెవరో..?
- కొత్త మలుపుతో ఆక్రమణల బేతాలుడు మళ్లీ మొదటి కొచ్చిన కథ

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఇది అచ్చం విక్రమార్క కథ చందాన ఉండటున్నారు జనం అదేనండి.... ఏలూరు కాలువల ఆక్రమణల తొలగింపు వ్యవహారం ముందికి మూడడుగులు.... వెనక్కి ఆరడుగులు అన్నా చందాన సాగుతోంది. తొలగించాల్సింది ఎవరో ఇన్నాళ్లకి ఓ ఐడియా ఇచ్చిపడేశారు. ఇప్పటికే పుణ్య కాలం చాలా గడిచిపోయింది. లోకాయుక్త తీర్పు అమలు చేసితీరతాం అంటూ ఊరువాడా ప్రచారంతో ఊదరగొట్టారు.ఆక్రమం దారులకి అనేక పర్యాయాలు నోటీసులు జారీ చేశారు.ఇక ఇప్పుడు ఇది పంచాయితీ రాజ్ కి కానీ, రెవిన్యూ విభాగానికి కానీ, పోలీస్ విభాగానికి చెందిన వ్యవహారం కాదని, కేవలం బాధ్యత ఇరిగేషన్ వారిదేననీ తేలికగా తేల్చేశారు. దీంతో ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడం, తొలగింపు వ్యవహారం ఇరిగేషన్ దే బాధ్యత అయింది. అక్రమణలు తొలగిస్తామన్నారు. ఏడు నెలల నుండి హడావుడి చేసిన అధికారులు ఇదంతా మనకెందుకు అని మౌనంగా ఉండిపోయారు. స్వచ్ఛందంగా అక్రమ తొలగించిన వారు నియోజవర్గ ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలు తొలగించిన వారు దర్జాగా వ్యాపారం చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కైకరంలో అసలు ఆక్రమములు స్వచ్ఛందంగా తొలగించుకోలేదు. అసలు ఆక్రమణ ఎందుకు ముందు సాగుతూ లేదని పలు శాఖల అధికారులను ప్రశ్నించారు. కాలువ గట్టు ఆక్రమణలు ఇరిగేషన్ శాఖలో ఉన్నాయని ఓ అధికారి ఐడి ఇచ్చారు. దీనికి బాధ్యత అంతా ఇరిగేషన్ శాఖదే అంటూ ప్రకటించడం జరిగింది. ఇరిగేషన్ శాఖ అధికారులతో నియోజవర్గ ప్రతినిధి మాట్లాడటం జరిగింది. ఇరిగేషన్ శాఖ అధికారి తమ ఆధ్వర్యంలో సర్వే చేసి ఆక్రమణలను గుర్తించటం జరిగింది. ఆక్రమణలను తొలగించడానికి ముహూర్తం పెట్టినట్లు తెలిసింది. ఇరిగేషన్ అధికారులకు తెర వెనుక మేము ఉంటామని మిగిలిన శాఖ అధికారులు భరోసా ఇచ్చారు. తాహసిల్దార్, మండల పరిషత్, పోలీస్ శాఖ ఇరిగేషన్ వారికి భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఇరిగేషన్ శాఖ అధికారి కూడా ఆయా శాఖ అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలంలో కాలువ గట్టుకు ఇరువైపులా ఉన్న అక్రమణం తొలగించడానికి రంగం సిద్ధం చేశారు. ఈ నెలలో పోలీస్ బందోబస్తు మధ్య, రెవిన్యూ, మండల పరిషత్ శాఖ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.అన్నది వెయ్యి డాలర్ల ప్రశ్న. బదులు ఎవ్వరు చెబుతారు?, ఏలూరు కాలువ కాలుష్య కోరల్లో విలవిలలాడక తప్పదా? ఇంకా ఎంత కాలం ఈ ప్రక్రియ సాగుతీత?అన్న ప్రశ్నలు వస్తున్నాయి.

దాతల వితరణ వెలకట్టలేనిది

విశాలాంధ్ర - భీమడోలు : మానవ సేవే మాధవసేవ అనే సిద్ధాంతాన్ని నమ్మి దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తున్న దాతల వితరణ గొప్పదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 66మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమంలో భాగంగా సన్నబియ్యం, పండ్లను గ్రామానికి చెందిన నంబూరి సుబ్బరాజు, అనసూయమ్మ, హరినాథరాజు అందజేసారు. దివ్యాంగులకు భోజనాన్ని చల్లా నరసింహమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు సరస్వతి,రాధ, రజిత ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సేవాభావంతో దివ్యాంగుల అభివృద్ధికి వారి అవసరాలు తీర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవాసమితి సభ్యులను, దాతలను అభినందించారు.ఈ కార్యక్రమంలో శివలంక రామకృష్ణ, నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, అరసంకల సోములు, రావి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ జిల్లా అధ్యక్షుడిగా దాసరి కృష్ణంరాజు

విశాలాంధ్ర - ఏలూరు : ట్రెజరీస్ - అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా సంఘ ఎన్నికలు ఆదివారం స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఏలూరులో జరిగాయి. ఈ ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా దాసరి కృష్ణంరాజు (అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్, డిసిహెచ్ఎస్, ఏలూరు),జిల్లా కార్యదర్శిగా ఇ. మహేష్ బాబు, (సీనియర్ అకౌంటెంట్, జిల్లా ట్రెజరీ ఏలూరు), సహాధ్యక్షులుగా పి మాధవి (ఎకౌంట్స్ ఆఫీసర్, డ్వామా , ఏలూరు) ఉపాధ్యక్షులుగా పి ప్రేమావతి (సహాయ ఖజానాధికారి, జిల్లా ఖజానా కార్యాలయము ఏలూరు),ఎన్ శ్రీనివాసరావు (ఉప ఖజానాధికారి,భీమడోలు), ఎస్ జయలక్ష్మి,(సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయము ఏలూరు) , కార్యనిర్వాహక కార్యదర్శిగా వై. శిరీష్ కుమార్ (సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరు) జాయింట్ సెక్రటరీలుగా ఎస్ చినబాబు (ఉపఖ జానాధికారి, డివిజనల్ సబ్ ట్రెజరీ జంగారెడ్డిగూడెం)ఎన్ సాయి కృష్ణ (జూనియర్ అకౌంటెంట్ ఉపఖజానా కార్యాలయము కైకలూరు) కె.రత్నకుమారి (సీనియర్ అకౌంటెంట్ డివిజనల్ సబ్ ట్రెజరీ ఏలూరు), ట్రెజరర్ గా కె. నరేంద్రబాబు (సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరు) వారు ఏకగ్రీవముగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి షేక్ హసీనా బేగం, ఏపి.టాసా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తెలియజేశారు.సంఘము సభ్యుల పురోభివృద్ధికి పాటుపడుతూ త్వరలోనే అన్ని జిల్లాల ఎన్నికలు పూర్తి చేసుకుని రాష్ట్ర సంఘ ఎన్నికలకు వెళతామని ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అయిన హసీనా బేగం తెలియజేసినారు.జిల్లాలో సంఘ సభ్యుల అభ్యున్నతికి, వారి పదోన్నతులకు, వారి శ్రేయస్సుకు పాటుపడతామని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు డి కృష్ణంరాజు, కార్యదర్శి ఇ. మహేష్ బాబు ఈ సందర్భంగా తెలియజేసినారు.నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గానికి ఏపి.టాసా రాష్ట్ర అధ్యక్షులు జి. రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాజ్ కుమార్, జిల్లాలోని యావన్మంది ట్రెజరీ అకౌంట్స్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

భాధిత కుటుంబానికి 'మనకోసం మనం' సాయం అందజేత

విశాలాంధ్ర - పాలకొల్లు: పోడూరు మండలం జిన్నూరు నరసరాజు నగర్‌లోని నిరుపేద రైతు కుటుంబానికి చెందిన వ్యవసాయ కూలీ కౌరు అప్పారావు భార్య కౌరు నాగమణి (45), ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న మనకోసం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల పెద్దిరాజు, సంఘ సభ్యులతో కలిసి వెళ్లి బాధిత కుటుం బాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని, కుమారుడు కౌరు ఏసుకు అందజేశారు. మానవతా దృక్పధాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పడాల కృష్ణవేణి, దాసరి సత్యనారాయణ, కేతలి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ ఉత్సవాలకు ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : శ్రీ జగదాంబ అమ్మవారి 68వ వార్షికోత్సవ ఉత్సవాలకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఆదివారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆలయ కమిటీ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మవారి ఉత్సవాలను విజయవంతం అవ్వడానికి కృషి చేయాలని సూచించారు. జగదాంబ అమ్మవారి ఉత్సవాలు మార్చి ఆరవ తేదీ నుండి 12వ తేదీ వరకు జరుగుతాయి. ఈ ఉత్సవాలలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ జగదాంబ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు ధారా మధు, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, జనసేన నాయకులు చిర్రి కృష్ణ పాల్గొన్నారు.

పోలీసు వృత్తిలో అంకితభావంతో పనిచేయాలి

ప్రొబేషనరీ ఎస్సైలకు నియామక ఉత్తర్వులు అందజేసిన ఐజీ అశోక్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : వృత్తిపట్ల నిబద్ధత, అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు పోలీస్ శాఖ పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జివిజి.అశోక్ కుమార్ సూచించారు. రెండు సంవత్సరాల క్రితం ఏలూరు రేంజ్ పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్ లుగా ఎంపికై అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణ పూర్తి చేసిన ప్రొబేషనరీ ఎస్సైలు ఆదివారం ఏలూరులోని ఐజీ కార్యాలయంలో ఐజీని మర్యాద పూర్వకంగా కలవడంతో ప్రొబేషనరీ ఎస్సైలకు ఐజీ అశోక్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలోకి కొత్తగా చేరుతున్న అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనంతో బాధితులకు న్యాయం చేసి ముద్దాయిలకు శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం ఏర్పడేందుకు శక్తి లేకుండా పనిచేయాలన్నారు. కాగా ఏలూరు రేంజ్ పరిధిలో 100 మంది ప్రొబేషనరీ ఎస్సైలు తమ ప్రొబేషనరీ పూర్తి చేయగా వీరిలో 68 మంది పురుషులు, 32 మంది మహిళలు ఉన్నారు. దీంతో వీరందరికీ ఆయా జిల్లాల్లో నియామక ఉత్తర్వులు ఐజీ అందజేశారు.

-జిల్లాల వారీగా ఎస్సైల నియామక వివరాలు :

ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్ఐలుగా ప్రొఫెషనల్ పూర్తి చేసుకున్న వారికి ఆయా జిల్లాల వారీగా నియామకాలను ఐజి అశోక్ అందించారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు 4, కాకినాడ జిల్లా 2, బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 1, తూర్పు గోదావరి జిల్లాకు 15, పశ్చిమ గోదావరి జిల్లాకు 1, ఏలూరు జిల్లాకు 1 కృష్ణా జిల్లాకు 20, ఎన్టీఆర్ జిల్లాకు 56 మందిని కేటాయిస్తూ ఐజి అశోక్ కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : బోడి గూడెం గ్రామపంచాయతీ అంకాల గూడెం గ్రామ ప్రజలకు మంచినీటి కొరత తీరనుంది. బోడిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంకాల గూడెం గ్రామంలో రెండు మంచినీటి బోర్లు, ట్యాంకులు, ఉండడంతో, ఈ రెండిటిలోని ఎస్సీ ప్రాంతంలో ఉన్న ఒక బోరు పాడైపోవడంతో ఎస్సీ కాలనీ ప్రాంత ప్రజలకు మంచినీరు లేక 20 రోజుల నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న సంబంధిత పంచాయతీ అధికారులు, ఎంపీడీవో కిరణ్ కుమార్ మంచినీటి ట్యాంకును సందర్శించి బోర్ రిపేర్ చేయించారు. అయినప్పటికీ నీరు కొరత ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఎంపీడీవోకు తెలియజేయగా, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మండల ప్రజా పరిషత్ నిధులతో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నూతన బోరును నిర్మించడం జరుగుతుంది. నూతన బోరు నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటనే మంచినీటి ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చి ప్రజలకు నీరు సరఫరా చేస్తారని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. నూతన బోరు నిర్మించడంతో మంచినీటి కష్టాలు తీరుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులకు, నాయకులకు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపి, హర్షం వ్యక్తం చేశారు.

బొండాడ డ్రైన్‌లో గుర్తు తెలియని మృతదేహం

విశాలాంధ్ర- ఉండి : మండల కేంద్రమైన ఉండి బొండాడ డ్రైన్ లో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం స్థానికులు గుర్తించారు. గుర్రపు డెక్క చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాల లో ఉండటంవల్ల ఎవరు గుర్తించలేదు. దుర్వాసన వెదజల్లుటతో అటుగా వెళుతున్న బాటసారిలు, వాహనదారులు, దగ్గరకు వెళ్లి పరిశీలిస్తే మృతదేహం అని గుర్తించారు. మృతదేహం ఎక్కడి నుంచి వచ్చింది ఎవరు ఏంటి అనేది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీఎం సహాయనిధి అందజేత

విశాలాంధ్ర-టి నరసాపురం: ఆరోగ్యమే మహాభాగ్యం అని మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. రాజు పోతే పల్లి గ్రామంలో ఆయన నివా సం వద్ద షేక్ రమీజాకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన షేక్ రమీజా అనారోగ్యానికి గురికావ దంతో హాస్పిటల్ ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 35916 రూపాయల చెక్కు అందజేసి నట్లు ఆయన తెలిపారు. షేక్ సలీమ్, రమీజా దంపతులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఔషధాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - భీమవరం : గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించేందుకు కేంద్రం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శ్రీ విష్ణు ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఆదివారం ఎ.కె.ఆర్.జి హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యం, ఆరోగ్య పరీక్షలు, ఇన్ఫెక్షన్ నివారించడంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం పలు డయాగ్నోస్టిక్ సాంకేతికతలను ప్రదర్శించి బ్లడ్ గ్రూపింగ్ , హెమోగ్లోబిన్ , బీపీ పరీక్షలపై అవగాహన కలిగించారు. ఫార్మస్యూటికల్స్ తయారీ విధానాలను తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఎస్.నటరాజ్ , ప్రాజెక్ట్ పరిశోధకులు డాక్టర్ ఎస్.అనిల్ కుమార్, డాక్టర్ రఘు బాపి రాజు, బి.వి.రాజు నాలెడ్జి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

NOTICE

UNDER ORDER 5 RULE 20 (2) OF C.P.C.

మహారాజశ్రీ మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ మరియు రెండవ అదనపు జిల్లా జడ్జి : అమలాపురం వారి కోర్టులో

యమ్.వి.ఒ.పి. 139/2024

బిట్వీన్ :

కాశీ విజయరాజు - పిటీషనర్

మరియు

ఆకొతుల తులసీ శంకర్ వైగరా - రెస్పాండెంట్స్

టు, 1వ రెస్పాండెంట్ :

ఆకొతుల తులసీ శంకర్, మురళీకృష్ణ, డ్రైవర్, డోర్.నెం. 20బి- 13-23, కనకం వారి వీధి, గాంధీనగర్, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబరు యమ్.వి.ఒ.పి.లో మీకు పిటీషనర్ ఎన్నిసార్లు కోర్టు ద్వారానున్నూ, పోస్టుద్వారా సున్నూ నోటీసులు జారీ చేయించినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ యొక్క హాజరు నిమిత్తం ది. 07-03-2025 సం॥రం॥ తేదీన ఆఖరి వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజు ఉదయం గం. 10-30 ని॥ల నుండి పై కోర్టు వారి యెదుట స్వయముగా గానీ ఖద్యున గాని హాజరై మీ వాదనలు వినిపించుకొనవలెను. లేనియెడల మీకు ఏ విధమైన అభ్యంతరములు ఆక్షేపణలు లేవని మీ పరోక్షముందు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

వాయిదా : ది. 07-03-2025

(కోర్టువారి అనుమతిన)

దొనిపాటి ఆంజనేయులు, అడ్వకేట్, ముమ్మిడివరం, పిటీషనర్ తరపు అడ్వకేట్

బెల్లం విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : నిబం ధనల విరుద్ధంగా బెల్లం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం సర్కిల్ ఎక్సైజ్ సి.ఐ. కె.శ్రీనుబాబు అన్నారు.సర్కిల్ పరిధిలో ఉన్న బెల్లం వ్యాపా రులతో స్థానిక సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.నాటు సారా తయారీదారులకు బెల్లం విక్రయాలు చేయకూడదన్నారు.15 రోజులకు ఒకసారి బెల్లం అమ్మకం వివ రాలను సర్కిల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.నాటు సారా తయారీని విడిచిపెట్టి ప్రభుత్వం అందించే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు . నవోదయం 2-0 కార్యక్రమంలో భాగంగా బెల్లం వ్యాపారస్తులతో ఈ సమావేశం నిర్వహించామని శీను బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఐ.ఎస్. ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

లూర్దు మాత మహోత్సవాల్లో ఎమ్మెల్యే రోషన్ కుమార్

విశాలాంధ్ర - కామవరపుకోట : తడికల పూడిలో జరుగుతున్న లూర్దు మాత మహోత్సవాలలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొ న్నారు. శాసనసభ్యులను పుణ్యక్షేత్ర డైరెక్టర్, విచారణ కర్తలు డా. రెవ. ఫాదర్. నాతానియేలు, సిస్టర్స్, ఉపదేశీ మాస్టర్ మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూత నంగా నిర్మించిన లూర్దుమాత గృహాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తుల కోరిక తీర్చేటువంటి తల్లి లూర్దుమాత అని, ఆ తల్లి సన్నిధిలోకి ఇక్కడికి రావడం చాలా అదృష్టమని, భక్తులందరూ కూడా చింతలపూడి అభివృద్ధి కోసం ప్రార్థించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

మురుగు కాలువలోకి దూసుకెళ్లిన రొయ్యల కంటైనర్

విశాలాంధ్ర - కాళ్ళ : మండల కేంద్రమైన కాళ్లలో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచుకమ్ము కోవడం వలన రొయ్యలతో వెళ్తున్న కంటైనర్ లారీ ప్రమాదవశాత్తూ రుద్రా యకోడు మురుగు కాలువలోకి దూసు కెళ్ళింది. ఈ ఘటనలో డ్రైవర్ సహా ఎవ్వరికీ ప్రమాదం జరగలేదు. స్థానిక రైతులు, గ్రామ స్తులు వెంటనే రెండు క్రేన్ల సహాయంతో లారీని పైకి తీసుకు వచ్చారు. కంటైనర్ సీజ్ చేసి ఉండటంతో రొయ్యలు లారీలోనే సురక్షితంగా ఉన్నాయని, లేకుంటే భారీ నష్టం వాటిల్లేదని రైతులు చెప్పారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గోశాల ఏర్పాటు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వాసవి క్లబ్ కొయ్యలగూడెం కపుల్స్ ఆధ్వర్యంలో స్థానిక మదన గోపాల స్వామి ఆలయం వద్ద గోశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల్లా రామకృష్ణ చేతుల మీదుగా గోశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కపుల్స్ పాల్గొన్నారు.

సత్యనారాయణ మూర్తి అరెస్టు అక్రమం

విశాలాంధ్ర - ఏలూరు : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అరెస్టు అక్రమం అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్.ఐ. డబ్ల్యూ) ఏలూరు జిల్లా సమితి అధ్యక్ష కార్యదర్శులు వరకా శ్యామల, మన్నవ యామిని ఆదివారం ఒక ప్రకటనలో ఖం డించారు. జే.వి. సత్యనారాయణమూర్తి పట్ల పోలీ సులు అతిగా ప్రవ ర్తించారని,ప్రజల కోసం పోరా డిన వ్యక్తి అరెస్టు చేసి దారుణంగా వ్యవహరిం చారని పేర్కొన్నారు. గతంలో గోపా లపట్నం సమీ పంలోని ఎల్.జి.పాల్మర్స్ కం పెనీ విషవాయువులు వెదజల్లడంతో వంద లాది మంది ప్రజలు తీవ్ర అస్వస్థకు గురయ్యారని, పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలి పారు.ఈ ఘటనపై కంపెనీ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ, బాధితులకు న్యాయం చేయాలన్న డిమాండుతో జే.వి.సత్యనారా యణమూర్తి ఆధ్వర్యంలో సిపిఐ శ్రేణులు ఆం దోళన చేపట్టారని తెలిపారు.అయితే కరోనా నిబం ధనలు ఉల్లంఘించారంటూ అప్పట్లో ఆయనపై కేసు నమోదు చేశారన్నారు. అప్పటి నుండి నేటి వరకు కేసు పెండింగ్ లో ఉం దని,పెండింగ్ కేసుల పరిష్కారం అంటూ పోలీసులు సత్యనారా యణ మూర్తిని స్టేషన్‌కు పిలిపించి ఆయనను కోర్టుకు తరలించి రిమాండ్ విధించేటట్లు పోలీ సులు అత్యుత్సాహం ప్రదర్శించారని మండిపడ్డారు. ఆదివారం కోర్టుకు సెలవు కావడంతో ప్రజా సమ స్యలపై పోరాడిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుని పట్ల పోలీసులు దారుణంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం లో ఇలాం టి చర్యలు విచారకరం అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూని స్టులు ఇలాంటి నిర్బంధాలకు భయపడరని, ప్రజల కోసం పోరాడుతుంటారని స్పష్టం చేశారు. సత్యనారా యణమూర్తి పట్ల పోలీ సుల వ్యవహార శైలిని ప్రజా స్వామ్య వాదులందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మట్టి తవ్వకాలకు అధికారికంగా అనుమతులివ్వాలి

- వినియోగదారుల అవసరాలు తీరే అవకాశం
- అక్రమార్కుల ఆగడాలకు కళ్లెం
- చెరువుల అభివృద్ధికి మార్గం సుగమం

విశాలాంధ్ర - లింగపాలెం : మట్టి తవ్వకాలకు అధికారికంగా అనుమతులు లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినియోగదారుల అవసరాలను గమనించి అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాల వల్ల మెట్టప్రాంతంలోని చెరువులు మనుగడ ప్రమాదంలో పడింది. జీవనా దులైన చెరువులను కాపాడుకోవాలంటే వీటిని రక్షిం చుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. మట్టి తవ్వకాలకు ప్రభు త్వం నుంచి అనుమతులు లేవు. అయినా అక్ర మంగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఇష్టానుసా రంగా చెరువులను తొవ్వేయటం వల్ల గోతులు పడు తున్నాయి. ఇలా గోతులు పెట్టడం వల్ల చెరువులు ప్రమాదంలో పడటమే కాక ఈగోతుల్లో పడి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు జరుగుతున్నాయి. గోతుల్లో నీరు ఉన్న ఉపయోగ పడని పరిస్థితి నెలకొంటుంది.వీటిలో ఉన్న నీరు తూముల ద్వారా ఆయకట్టుకు వెళ్లే పరిస్థితి ఉం డదు. అక్రమంగా తవ్వేవారు ఒక చోటను వదిలి మరోచోట తిరిగి గోతులు పెట్టి మట్టిని తవ్వేస్తు న్నారు. వేసవి సీజన్ వచ్చిందంటే వినియోగదా రులకు ఇంటి పనులకు వివిధ రకాలైన అవసరాలు మట్టితో ఉంటాయి. మట్టి లేకపోతే పలు పనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఏదో విధంగా తమ అవసరాలు తీర్చు కొనేందుకు విని యోగదారులు ప్రయత్నిస్తున్నారు. దీన్ని అవకాశం గా తీసుకొని అక్రమ వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటు వంటి పరిస్థితుల వల్ల గ్రామాల్లో ప్రశాంతత లేకుండా పోతుంది.అక్రమ తవ్వకాలు అడ్డుకోవా లని కొందరైతే, తవ్వకాలు అడ్డుకుంటే తమ అవస రాలు ఎలా తీరుతాయని వినియోగదారులు ప్రశ్ని స్తున్నారు. దీనివల్ల గ్రామాలలో అలజడులు నెల కొంటున్నాయి. అధికారులకు, ఉద్యోగులకు తీవ్ర మైన సమస్యలు ఎదురవుతున్నాయి. తవ్వకాలను అడ్డుకుంటే వత్తిళ్ళు, తవ్వకాలను ఆపకపోతే వ్యతిరేకతను వీరు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అనేకమంది ఉద్యోగాలకు సెల వు పెట్టి ఇళ్లకు వెళ్లే పరిస్థితి నెల కొందని వాపోతున్నారు. అధికారులు ఈ పరిస్థితు లను తీవ్ర సమస్యగా పరిగణిం చాలని ప్రజ లు కోరుతున్నారు. తవ్వకాలకు అధికారి కంగా అనుమతులు ఇస్తే పూడికపడిన చెరు వులలో పూడికలు తీయవచ్చు. చెరువులు ఏర్పడ్డాక పూడికలు పూర్తిస్థాయిలో జరగ లేదు. చెరువు లన్నీ పూడిక పడి ఉన్నాయి. దీనివల్ల వర్షం వచ్చి చెరువు లోకి నీరు చేరినా సామర్థ్యానికి తగ్గట్టుగా నీరు నిల్వ ఉండటం లేదు. ఇటువంటి పరిస్థితి వల్ల ఆయకట్టు భూములకు నీరందని పరిస్థితి నెల పొంది. చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చి పద్ధతి ప్రకారం తవ్వకాలు జరిపితే పూడి కపడిన చెరువులను కాపాడటమే కాకుండా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చు. అంతేకాకుండా ప్రభుత్వా నికి ఆదా యం వస్తుంది. వినియోగదారుల సమ స్యలు కూడా తీరుతాయి. అక్రమ వ్యాపారుల ఆగ డాలు అరికడతాయి. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ప్పుడు కూడా అనుమతులు ఎందుకు ఇవ్వటం లేదు అనే ప్రశ్న తలెత్తుతుంది. వీటన్నిటిపై పరిశీ లన చేసి మట్టి తవ్వకాలకు అధికారిక అనుమతులు ఇవ్వా లని ప్రజలు కోరుతున్నారు. తవ్వకాలకు నిర్దిష్టమైన ఆమోదాలు ఉండేలా చర్యలు తీసుకో వాల్సి ఉంది. అనుమతులు ఇచ్చే ముందు వీటన్నిటిని పరిగణలోకి తీసుకోవాలి.

ఓట్లలెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అత్యంత అప్రమత్తతతో లెక్కింపు ప్రక్రియ నిర్వ హించాలని రిటర్నింగ్ అధికారి,ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారు లను ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాల యం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో విధులు కేటాయించిన ఓట్ల లెక్కింపు సిబ్బంది,టేబుల్ సూపర్ వైజర్లు, రోల్ ఇన్ చార్జ్ లు, పర్యవేక్షణ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్ లెక్కింపులో పూర్తి ఏకాగ్రతతో కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు.బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో,బండ్లింగ్ చేయుట, లెక్కించుట ప్రక్రియల నిర్వహణలో ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలన్నారు.ఈ ఎన్ని కలు బ్యాలెట్ పేపరు, మొదటి ప్రాధాన్యత ఓటు,నమోదు విధానం ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ఓట్ల లెక్కింపు చాలా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపుకు సంబంధించి 456 పోలింగ్ బూత్ ల నుండి వచ్చిన బ్యాలెట్ బాక్సుల్లో ఉన్న ఓట్లు లెక్కింపుకు 28 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ టేబు ల్‌కు కౌంటింగ్ సిబ్బందితో పాటు టేబుల్ సూపర్ వైజర్, రోల్ ఇన్ చార్జి, షిఫ్టు ఇన్ చార్జి లతోపాటు మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు సమయంలో పాటించాల్సిన నిబంధనలు,అనుసరించాల్సిన విధానాలపై ఇప్పటికే శిక్షణా తరగతులు నిర్వహించుకున్నామని, దానికి అను గుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈనెల 3వ తేదీన ఏలూరు సర్.సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే ఓట్ల లెక్కింపు విధులకు షిఫ్టుల వారీ 700 మంది సిబ్బందిని నియమించామని సోమవారం ఉద యం షిఫ్టుకు కేటాయించిన సిబ్బంది ఉదయం గం.6.30కు ఖచ్చితంగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు.

రామాలయంలో విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర- ఉండి : మండల పరిధిలో చిలుకూరు గ్రామంలో నూతన శ్రీ కోదండ రామాలయంలో సీతా సమేత రాముల వారి విగ్రహ ప్రతిష్ట వేద మంత్రోచ్చారణ నడుమ ఆదివారం ఘనంగా జరిగింది. మేళ తాళాలు మంగళ వాయిద్యాలు విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా కన్నుల విందు చేసింది. స్వామివారిని దర్శించుకోవడానికి వేలి వర్రు, ఉండి, మహాదేవ పట్నం, పాములపర్రు, ఎన్ ఆర్ పి అగ్రహారం, వాండ్రం, తదితర గ్రామాల నుండి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. అనంతరం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముదునూరి వెం కటస్వామి రాజు, చిలుకూరి నరసింహారాజు, చేకూరి బోసురాజు, మాజీ సర్పంచ్ రుద్రరాజు బంగారు రాజు, కృష్ణంరాజు, నవీన్ వర్మ, జీను ఆదినారా యణ, వెంకటేశ్వరరాజుపాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం : సతీష్‌కుమార్

విశాలాంధ్ర - పిఠాపురం : ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరికీ శ్రద్ధ అవసరమని, ప్రస్తుతం ఆరోగ్యంపై ప్రజలు నిర్లక్ష్యం చేస్తున్నారని రియాన్స్ క్లినిక్ డాక్టర్ వెంకటేశ్వర సతీష్ కుమార్ అన్నారు. ప్రతి వ్యక్తికి తన జీవితంలో ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవడం ఎంతో అవసరం. కానీ నేటి ఆధునిక సమాజంలో ప్రజలు ఆరోగ్యాన్ని పట్టించుకోవడంలేదు. వారి కోసం ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయి. అదే విధంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. మార్చి 3వ తేదీ సోమవారం పిఠాపురం పట్టణంలోని రాజావారి కోటలో వున్న సంతోషిమాత దేవాలయం వద్ద చిత్రాడ గ్రామానికి చెందిన పచ్చాల తాతారావు ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన రియాన్స్ క్లినిక్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పిఠాపురం నియోజకవర్గం ప్రజలు అందరూ సద్వినియోగపర్చు కోవాలని డాక్టర్ వెంకటేశ్వర సతీష్ కుమార్ తెలిపారు.

ఉపరాష్ట్రపతి దంపతులకు ఎంపీ సాన సతీష్ స్వాగతం

విశాలాంధ్ర - కాకినాడ : భారతదేశ ఉప రాష్ట్రపతి జగదీప్ దంపతులను కాకినాడ రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు హైదరా బాదులో కలిశారు. ఒకరోజు పర్యటనకు హైదరాబాద్ విచ్చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ దంపతులకు రాజ్యసభ సభ్యులు సాన సతీష్ బాబు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి దంపతులతో కలసి హైదరాబాదులో జరిగిన వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ డిపోలో రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : డ్రైవర్ ఎన్‌వి రమణ అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ ఏలేశ్వరం ఆర్టీసీ డిపోలో ఉన్న అన్ని యూనియన్లు జేఏసీగా ఏర్పడి సోమవారం నుండి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు జేఏసీ కన్వీనర్ కే త్రిమూర్తులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1/2019 జీవోకు వ్యతిరేకంగా డిపో మేనేజర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్ జీవి రమణను జీవోకు వ్యతిరేకంగా సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ గత పది రోజులుగా ఎర్ర రిబ్బన్లు ధరించి విధులకు హాజరై మధ్యాహ్నం డిపో గేట్ మీటింగ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న డిపో మేనేజర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ జీవో 1/2019 ఖచ్చితంగా అమలు చేసి డ్రైవర్ ఎన్‌వి రమణ తిరిగి విధులలోనికి తీసుకోవాలని అలా లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని జె కొత్తూరు శివారులో తాగునీటి ఎద్దడి ప్రాంతాలను ఎంపిడిఓ ఏవిఎస్ చంద్రశేఖర్, ఈఓపిఆర్డీ సూర్య భాస్కరరావు పరిశీలించారు. గ్రామంలో చిన్నయ్యపేట కాలనీలో నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనే వార్తలు రావడంతో వారు వెళ్ళి పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. సాయంత్రం సమయంలో నీరు రావడంలేదని వారు విన్నవించారు. ఒకపూట మాత్రమే ఇక్కడ నీళ్లు అది ఉదయం ఇవ్వడం జరుగుతుందని పంచాయితీ కార్యదర్శి కె శ్రీనివాస్ అధికారులకు తెలిపారు. ఉదయం, సాయంత్రం తాగునీరు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుని. నీటి ఎద్దడిని ఎదుర్కొనాలని పంచాయతీని ఎంపిడిఓ ఆదేశించారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - సీతానగరం: అగ్ని ప్రమాద పొగాకు బ్యారెన్ల రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రాజానగరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో కాటవరం గ్రామంలో ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో 4 పొగాకు బ్యారన్లు,3 రెల్లు గడ్డి పాకలు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. వాటికి సంబంధించిన రైతులను సంఘటన స్థలాన్ని జక్కంపూడి రాజా పరిశీలించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ పొగాకు బాధిత రైతులకు, కౌలు రైతులకు ప్రస్తుతం మార్కెట్లో ఉన్న పొగాకు ధరలను బట్టి ఆర్థిక సహాయం అందించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం దూరతి గతిన ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి : రఘురామ్

విశాలాంధ్ర - జగ్గంపేట : భారత రాజ్యాంగం పట్ల ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఒమ్మి రఘురామ్ అన్నారు. ఆదివారం జగ్గంపేటలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలోను, మండల కార్యవర్గ సమావేశం లోను అలాగే డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న బాలికల వసతి గృహంలో జరిగిన అవగాహన సదస్సు లోను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు అన్నారు. మత గ్రంథాలను మించిన గొప్ప ధర్మశాస్త్రం రాజ్యాంగం అన్నారు. ఏ మతం వారు ఆయా మత గ్రంథాలను ఆచరించక పోయినా పర్వాలేదు కానీ, భారత రాజ్యాంగాన్ని మాత్రం అందరూ ఆచరించి తీరాల్సిందే అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ప్రసంగి ఆదినారాయణ, రాష్ట్ర సాహిత్య విభాగం కార్యదర్శి సన్యాసిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యస్ గోపాలకృష్ణ చేతుల మీదుగా కాకినాడ జిల్లాకు ప్రచార రథాన్ని అందించిన కడియాల నాగరాజును సన్మానించారు. అనంతరం జగ్గంపేట పట్టణంలో ప్రచార రథంతో రాజ్యాంగం పట్ల ప్రజాస్వామ్యం పట్ల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జిల్లా బాధ్యులు నీలపల్లి అప్పారావు, కిర్లంపూడి జిల్లా బాధ్యులు కర్రి నారాయణమూర్తి, గండేపల్లి మండల బాధ్యులు కొట్టు శివరామకృష్ణ, గోకవరం మండల బాధ్యులు నరాలశెట్టి నరసయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గున్నాబత్తుల అనుషా, బొడ్డేటి అప్పారావు, రెడ్డి భాను ప్రతాప్, మండల కార్యవర్గ సభ్యులు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

చేపలు మృత్యువాత

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని రామవరం ముత్యాలమ్మ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే గోనేడ వెళ్లే రోడ్డు గ్రామ శివారున ఉన్న ఈ చెరువు ఉంది. గ్రామానికి చెందిన హరిజనులు సొసైటీగా ఏర్పడి ఆ చెరువులను చేపలను పెంచుకుని జీవనం సాగిస్తూ ఉంటారు. అలాగే ఈ చెర్వులోని నీటిని ఆయకట్టు రైతులు పొలాలకు వాడుకుంటూ ఉంటారు. అదే తరహాలో పొలాలకు నీటిని వాడుకున్నారు. నీరు తగ్గుముఖం పట్టడంతో ఆదివారం చేపలను విక్రయించేందుకు సొసైటీ వారు శనివారం సాయంత్రం చేపలను పట్టి ఆ నీటిలో ఒడ్డున వలలో ప్రతి ఏడాదిలానే వదిలిపెట్టారు. ఆదివారం తెల్లవారుజామునే వారు ఆ చెరువులోని చేపలను విక్రయించేందుకు బయటకు తీస్తే అవి చనిపోయి ఉన్నాయి. దాంతో వారు లబోదిబోమన్నారు. సుమారు 3 టన్నులు చేపలు చనిపోయాయని 3 లక్షలు రూపాయలు నష్టం వాటిల్లిందని వారు వాపోయారు. చేపల నుండి వచ్చే ఆదాయం ద్వారా ఫిషర్మెన్ సొసైటీకి పన్ను చెల్లించడం జరుగుతుందని, ఈ ఏడాది చెల్లించే పన్నును తగ్గించాలని వారు కోరారు. విషయం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు చెరువును సందర్శించి, వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు విషయాన్ని వివరిస్తానన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం పల్లంట్ల శ్రీ రాజరాజేశ్వరీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివార కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వై సుజనా శర్మ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆశీర్వదించి స్వామివారి వస్త్రాలు అమ్మవారి కుంకుమలు అందజేశారు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్న సమారాధన పాల్గొని ప్రసాదం స్వీకరించారు ఈ సందర్భంగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను గోపాలపురం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు శ్రీ రాజరాజేశ్వరీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయానికి వచ్చి పూజలు అభిషేకాలు నిర్వహించి స్వామివారి అభిషేకాలు పూజలు నిర్వహించా నని గుర్తుచేసుకున్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోయిలమూడి సూర్యంద్రనాథ్ చటర్జీ ముక్కపాటి శ్రీనివాసరావు జానకిరామయ్య బలుసు విజయలక్ష్మి స్థానిక భక్తులు మహిళా భక్తులు పాల్గొన్నారు మహాశివరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది మండలంలోనించి ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు అందజేశారు భక్తుల సౌకర్యం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

విజ్ఞాన, గణిత శాస్త్రాల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కాకినాడ : న్యూ సెంచరీ స్కూల్లో విజ్ఞాన, గణిత శాస్త్రాల పై విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శాస్త్ర ప్రదర్శన అవిన్య (సైన్స్ ఫెయిర్) నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా, వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం వారిలో మరింత ఉత్సాహాన్ని నింపిందని స్కూల్ కరస్పాం డెంట్ డాక్టర్ ఎం వెంకట్ ఆనందం వ్యక్తం చేశారు. గణిత శాస్త్ర నిపుణులు ఎస్‌టీజీవిస్ భాష్యం, విద్యా ర్థుల ప్రదర్శనను ప్రశంసిస్తూ, వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆకాంక్షించారు. విద్యార్థుల చిన్న మెదడులకు పదును పెట్టేలా రూపొందించిన ప్రయోగాలను గమనించిన జీవశాస్త్ర అధిపతి డాక్టర్ బి శ్రీను, రసాయన శాస్త్ర అధిపతి వి సోమేశ్వరరావు, గణిత నిపుణులు జె రామకృష్ణ తదితర అతిథులు, వారి సృజనాత్మకతను అభినందిం చారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ నిహారిక, ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసించి, వారికి బహుమతులు అందజేశారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ నారాయణమూర్తి, విద్యార్థులకు విలువైన మార్గదర్శనం ఇచ్చి, వారి ప్రతిభను మరింత మెరుగుపరిచేందుకు సహాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యా యులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

జయ కుమార్‌కు ఎమ్మెల్యే సత్యానందరావు నివాళి

విశాలాంధ్ర - రావులపాలెం : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరం జయకుమార్ వర్ధంతిని పురస్కరించుకుని రావులపాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నివాళులర్పించారు.

ముగిసిన వర్కుషాప్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెంలోని గల ఆదిత్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బి టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి శిక్షణా సంస్థ అధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై ఐదు రోజుల వర్క్ షాప్ విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఏపీఎస్ఎస్‌డిసి ట్రైనర్ సిహెచ్ సంతోష్ పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో భాగంగా ట్రైనర్ మాట్లాడుతూ మన రోజు జీవితంలో కీలకంగా మారిన ఎంబెడెడ్ సిస్టమ్స్ గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ ప్రపంచం మరింత డిజిటల్‌గా కనెక్ట్ చేయబడి ఆటోమేటెడ్‌గా మారుతోందని, ఎంబెడెడ్ టెక్నాలజీ ద్వారానే ఇది సాధ్యపడుతుందని, దీని ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అని ఆయన అన్నారు. ఈ వర్కుషాప్‌లో భాగంగా ఆఖరి రోజున ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్, అడ్మినిస్ట్రేషన్ డీన్ డా వైకెవిస్ సుబ్బారావు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా ఎమ్ రవీంద్ర పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌కి డా ఎమ్ విజయ్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

మహారాజ శ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S. No. 19/2021

Between

బొరుసు లక్ష్మీ దుర్గ మహేశ్వరి మరియు ఇతరులు ... అప్పిలెంట్స్

మరియు

బొరుసు శ్రీ రామకృష్ణ మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్.

To.

R1: బొరుసు శ్రీరామ కృష్ణ s/o కృష్ణ మూర్తి, R/o గంటి పెదపూడి, పి. గన్నవరం మండలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.

R5: యర్రంశెట్టి రుద్రరావు s/oజానకి రామయ్య D.NO: 3-22-3, శ్రీ రామ్ పురం, రాజానగరం మండలం, తూ: గో: జిల్లా.

పై నెంబరు కేసులో మీ హాజరు నిమిత్తం ది. 19-03-2025 వ తేదిన శ్రీ కోర్టు వారు వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం గం: 10:30ని: లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరాలు ఉన్న యెడల తెలియపరచవలెను.

వాయిదా తేది: 19-03-2025

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

N .Ch. వెంకటేశ్వరరావు

K.P.R.R. నాయుడు

అడ్వకేట్ అమలాపురం.

Cell: 9885464893

కమ్యూనిటీ హాలు అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కడియం : ఇరవై మూడు సంవత్సరాల క్రితం నిర్మించిన కమ్యూనిటీ హాలును ఇప్పుడు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ సహకారంతో మరమ్మతులు పూర్తిచేసి ఆధునికరించామని, వారి సహకారంతో రానున్న రెండేళ్లలో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిపాటి రామారావు చౌదరి అన్నారు. కడియం మండలం, మురమండ గ్రామంలో, జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న శ్రీలక్ష్మీ గణపతి వీవర్స్ కమ్యూనిటీ హాలు ఆధునీకరణ పనులు పూర్తి చేసి పునః ప్రారంభించారు. పురోహితులు గోవిందరాజుల చక్రపాణి బత్తుల నాగేశ్వరరావు సత్యవతి దంపతులతో పాటు ఉప్పు రాజు మంజు, చల్లా సత్యనారాయణ పుష్ప, చింతా రాజు వెంకటలక్ష్మి, దొడ్డిపట్ల సాంబమూర్తి కృష్ణవేణి, యర్రా కేశవ గణేశ్వరి, మాడా సూర్యనారాయణ పద్మ, జట్లా గోపాలకృష్ణ రాజకుమారి, దంపతులతో శాస్త్రయుక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కమ్యూనిటీ హాలు అభివృద్ధికి కృషి చేసిన

ప్రతిపాటి రామారావు చౌదరి సూర్య కుమారి దంపతులకు, పోతుల కిట్టయ్య, చింతా సత్యనారాయణ భార్య సత్యవతి కి కమిటీ ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవళ్ళ రామ్మోహన్ రావు, వట్టికూటి జానకి రామయ్య (దత్తుడు), గన్ని పెద బాబి, గారపాటి శ్రీనివాస్, జట్లా తాతారావు, గుత్తి పండు, అల్లాడ ప్రకాశం, బత్తుల కామేశ్వరరావు, గణేష్, బొమ్మన సురేష్, జట్లా వెంకట రమణ, మాడా గణేష్, పిల్లా వెంకట్రావు పాల్గొన్నారు.

సత్యదేవ నర్సరీ సందర్శన

విశాలాంధ్ర - కడియం : నర్సరీ రంగంలో పేరుగాంచిన కడియం మండలం ఉద్యానవనాలు అద్భుతంగా ఉన్నాయని అమరావతి హైకోర్టు జడ్జి టి మల్లికార్జునరావు అన్నారు. ఆయన ఆదివారం కడియం మండలం కడియపులంకలో శ్రీ సత్యదేవా నర్సరీ ని సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆగ్లోనెమ మొక్కతో ఆయనకు స్వాగతం పలికారు. నర్సరీ లో ఇండోర్ మొక్కలలోని రకాల గురించి, ముఖ్యంగా అరికపామ్ డ్వార్ఫ్ మొక్కను గురించి వివరించి చెప్పారు. అనంతరం జడ్జి మల్లికార్జునరావు కొన్ని మొక్కలను ఆర్డర్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల అందాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుల్లా

వీరబాబు, పుల్లా రాజశేఖర్, డిఎస్పీ భవ్య కిషోర్, కడియం ఎంఆర్ఓ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పాశాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - సీతానగరం: పాశాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో రాజానగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యారు. మండలంలో కాటవరం గ్రామంలో గల కాటవరం గ్రామ దేవత పాశాలమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణం గ్రామస్తులు, దాతల సహకారంతో చేపట్టడం జరిగిందని అందులో భాగంగా చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యి ముందుగా ధ్వజస్తంభం దర్శించుకుని తరువాత శ్రీ పాశాలమ్మ అమ్మవారిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ శ్రీ పాశాలమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లవేళలా ఉండాలన్నారు. వైఎస్ఆర్సీపీ పార్టీ అధికారం ఉన్న సమయంలో నియోజకవర్గంలో 117 ఆలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో శ్రీవాణి ట్రస్టు ద్వారా

ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షలు గ్రాంట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కరుటూరి శ్రీహరిబాబు, గంటా శ్రీను మల్లిన చౌదరి,ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న పాల్గొన్నారు.

ఉప ఆలయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - అనపర్తి : రామవరం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ సందర్భంగా ఉప ఆలయానికి జరిగిన శంకుస్థాపనలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆదివారం కుతుకులూరు శ్రీ పార్వతి సమేత శ్రీ కుటేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హైకోర్టు

న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి సుజాత దంపతులు, కర్రి రామ్ గోపాల్ రెడ్డి దంపతులు (న్యూఢిల్లీ), ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : శ్రీ పార్వతీ సమేత కుటేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కుతుకులూరు కుటేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి ఆలయ పునః ప్రతిష్ఠలో మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి, వైసిపి నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలం హుస్సేన్ పురంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు మండల తెలుగుదేశం పార్టీ నాయకుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌పురం పరిసర ప్రాంతానికి చెందిన సుమారుగా 200 మందికి ఆసుపత్రి వైద్యులు పూజ కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో సుమారు 50 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేసారు. వీరికి సోమవారం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి నందు ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన యువ నాయకులు బుజ్జిని గ్రామ ప్రజలు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కోట అప్పారావు, చల్లా వెంకట రమణ, మార్ని సూర్యారావు, పుప్పాల రమణ, పుప్పాల గిరి, యవర్ల అబ్బాయి, యవర్ల సత్తిబాబు, మార్ని హరి, శ్రీను, మార్ని సురేంద్ర, తలారి వెంకటేశ్వరరావు, పుప్పాల శివ, పుప్పాల సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.:

అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని రిలే దీక్షలు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం డిపో డ్రైవర్ బిఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని మరియు 1/2019 సర్కులర్ కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఏడో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా వి గణపతి రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి ఈ పోరాటాన్ని డిపోలోని అన్ని యూనియన్ కలుపుకొని పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకత్వం చొరవ తీసుకొని ఈ పోరాటాన్ని ఉధృతం చేయాలన్నారు. గ్యారేజ్ గేట్ వద్ద జరిగిన గేట్ మీటింగ్ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ డిపో ఉపకార్యదర్శి రంగ ప్రసాద్ కార్మికుల ఉద్దేశించి ఈ సమస్య డిపోలోని కార్మికుల అందరి సమస్యగా భావించి గేట్ మీటింగ్‌కు మరియు నిరాహార దీక్షలో కూర్చున్న కార్మికులకు విప్లవ అభినందనలు తెలియజేశారు. ఈ సమస్యను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోనల్ 2 కలగజేసుకొని ఈ సమస్య పరిష్కారం చేయాలని కోరారు. డిపో అధ్యక్షులు ఆర్ నారాయణరావు ఈ కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు.

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి భాష్యం స్కూల్ నందు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన అనేక ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి.పేరయ్య నాయుడు మాట్లాడుతూ దేశ పుగతిని ప్రపంచగతిని మార్చగలిగే ప్రభలమైన శక్తి శాస్త్ర సాంకేతిక రంగాలకు శాస్త్రవేత్తలకు ఉందని, ఆదిశగా విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేవిధంగా విద్యార్థులచే సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహస్తున్నామని అన్నారు. సి.వి. రామన్ స్ఫూర్తిగా విద్యార్థలు సైన్స్ పరి శోధనలవైపు అడుగులు వేయాలని అన్నారు. ఈ కారక్రమంలో భాష్యం చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా సైన్స్ ఉపాధ్యాయులు కీర్తి రాణి, రత్నకుమారి, అప్పారావు, ఉదయ్ కిరణ్, శ్రీను బాబు,సింధు, స్వర్ణ మాధురి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం డివిజన్ ప్రైవేట్ పాఠశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ సమావేశం ప్రస్తుత అధ్యక్షులు ముమ్మిడి ప్రతాప్ కుమార్ అధ్యక్షతన వాగ్దేవి స్కూల్‌లో జరిగింది. సమావేశంలో విధ్యానిది విధ్యాసంస్థల అధినేత ఆకుల బాపన్న నాయుడు ముఖ్య అతిథిగా హాజరు అయ్యి, నూతన కార్యవర్గాన్ని అందరి ఏకాభిప్రాయంతో ఎన్నిక చేయడం జరిగినది. వీరి నిర్ణయాన్ని రాష్ట్ర నాయకులు సిరిపల్లి సిద్దార్థ పాఠశాల అధినేత మట్టపర్తి సత్యనారాయణ, అమలాపురం డివిజన్ గౌరవ అధ్యక్షులు తులిప్స్ పాఠశాల అధినేత నెల్లి రమేష్, మదర్ తెరెస్సా పాఠశాల అధినేత మంగళంపల్లి అంజిబాబు, అమలాపురం నెహ్రూ పాఠశాల అధినేత తోటనరసింహం, అల్లవరం గణపతి పాఠశాల అదినేత కంకిపాటి గణపతి మరియు వివిద మండల నాయకులు ఏకగ్రీవంగా ఆమోదిం చారు.

నూతన కార్యవర్గం : ప్రెసిడెంట్ రవీంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ పొత్తూరి లక్ష్మి శ్రీనివాస, సెక్రెటరీ గిడ్ల రమేష్ కరస్పాండెంట్ సత్య సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్. ఎన్ కొత్తపల్లి, ఉప్పల గుప్తం మండలం...(సెక్రెటరీ ట్రెజరర్ ఖా కోళ్ళపు శ్రీరామ సతీష్ హనుమాన్ పాఠశాల తదితరులు ఎన్నికయ్యారు.

ఎస్పీ దంపతులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరమును సందర్శించిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులు ఆదివారం ఉదయం ఎస్పీ నర్సింహ కిషోర్ దంపతులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని సందర్శించుకున్నారు ఆలయ అర్చకులు అగ్నిహోత్రం దత్తు ఎస్పి దంపతులకు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు ఈ సందర్భంగా ఎస్పీ దంపతులు శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు కుంకుమ పూజ నిర్వహించారు స్వామివారికి అర్చనలు చేశారు ఈ సందర్భంగా ఎస్పీ నర్సింహ కిషోర్ దంపతులను ఆశీర్వదించి స్వామి వారి శేష వస్త్రాలను బహుకరించారు అనంతరం ఎస్పీ నర్సింహ కిషోర్ దంపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య జ్ఞానమందరంలో పూజలు నిర్వహించారు ఆది శంకరాచార్యులు విఘ్నేశ్వరుడు మహాలక్ష్మి సరస్వతి అమ్మవారి లకు పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆది శంకరాచార్య ధ్యాన మందిరం కమిటీ ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ హారతులు ఇచ్చారు అనంతరం ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులకు జ్ఞాపకం అందజేసి జెసి శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన ప్రముఖులు తీగల బలరామయ్య గుడ్ల వెంకటేశ్వరరావు గేలం వెంకటేశ్వర రావు జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో ధ్యాన మందిరం ప్రధాన కార్యదర్శి తోట సత్యనారా యణ స్థానిక అయ్యప్ప గురు స్వామి తీగల బలరామయ్య స్థానిక ప్రముఖులు గుడ్ల వెంకటేశ్వరరావు గేలం వెంకటేశ్వరరావు దేవరపల్లి ఎస్సై వి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్ఎస్పీఐఆర్ఏ ఉత్సవాలు

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానిక సీతయ్యతోటలో గల ఆదిత్య పాఠశాలలో కన్నుల పండుగగా ఐఎన్ఎస్పిఐ ఆర్ఏ (ఇన్స్పిరా) -2025 అకాడమిక్ ఉత్సవాలు నిర్వహిం చారు. తెలుగు నుండి సోషల్ వరకు అన్నీ సబ్జెక్టుల వారీగా వినూత్న అంశాలను విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి చక్కగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్ శ్రీనివాస్ వినీల్ (డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్) సివి రామన్ చిత్రపటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వారిలో దాగియున్న ప్రతిభను వెలికి తీయు టకు ఒక్క సైన్స్‌కు పరిమితం కాకుండా అన్ని సబ్జెక్టులకు అవకాశం ఇన్ని విద్యార్థులను ప్రోత్సహించు విధానం తమకెంతో నచ్చిందని శ్రీనివాస్ వినీల్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 700 మంది విద్యార్థులు 264 ప్రాజెక్టులలో పాల్గొన్నారని, ఆదిత్య పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ విజయసారథి చెప్పారు. ఈ ప్రాజెక్టులలోని అంశాలు తల్లిదండ్రులను, వివిధ పాఠశాల విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నాయని ఇన్చార్జ్ శ్రీనివాస్ తెలియజేశారు. కుల వృత్తులు, సాహిత్య సమ్మాన్, హిందీ భాష చరిత్ర, హిందీ వ్యాకరణ అనే అంశాలు విద్యార్థులు హిందీ భాషలో చక్కగా బోధించి పలువురిని ఆకట్టుకున్నారు. ఫిజిక్స్ ప్రాజెక్టులు, సురక్ష, జనరేటింగ్ ఎలక్ట్రిసిటీ, ఫ్రేమ్ వేస్ లేబర్ సెక్యూరిటి అలారమ్, హైడ్రాలిక్ మేషీన్లు, వీక్షకులకు కనువిందు చేయడంతో పాటు, విద్యార్థుల బోధన వారిని ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి చిందాడ చిన్నోడు, తిరగటి గణేష్, అల్లంరాజు మూర్తి, కొవ్వాడ ఫణికుమార్, వీరమళ్ళ లక్ష్మినారాయణ కుమారి, మహ్మద్ జిలానీ భాషా, పంతుల సూర్యకుమారి జడ్జిలుగా వ్యవహరించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు విద్యార్థులకు ప్రదానం చేసారు.

బీజేపీ జిల్లాస్థాయి సమావేశం

విశాలాంధ్ర - కాకినాడ : 2న కాకినాడలో బోట్ క్లబ్ వద్ద గల చోడే వారి ప్రకృతి వైద్యాలయంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాకినాడ భారతీయ జనతా పార్టీ కొత్తగా నియమించిన మండల అధ్యక్షులు, జిల్లా పదాది అధికారులతో సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధులుగా బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ మరియు రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాశి రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మరియు కాకినాడ పార్లమెంటరీ ఇంచార్జి రావూరి సుధ, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జి మట్టు మంగ రాజు, భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంకట్రావు, ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సింగిలిదేవి సత్తిరాజు, ప్రత్తిపాడు మండల అధ్యక్షులు ఊట వీరబాబు, ఏలేశ్వరం రూరల్ మండల అధ్యక్షులు నీలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభను పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో నిర్వహించేందుకు అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. ఇందుకు సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా అమలాపురం నియోజకవర్గానికి కో-ఆర్డినేటర్‌గా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యంయస్‌యంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ ఆదివారం అమలాపురం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అమలాపురం పట్టణంలో ఒక హోటల్లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితో పనిచేసి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. 'హలో...అమలాపురం చలో పిఠాపురం" అనే నినాదంతో కార్యకర్తలు నాయకులు గ్రామస్థాయి వరకూ వెళ్లి జనసమీకరణ చేసి సభకు అమలాపురం నియోజకవర్గం నుండి భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆవిర్భావ సభ పోస్టర్‌ను విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో క్రౌడ్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు కల్వకొలను తాతాజీ, సీనియర్ అయితాబత్తుల ఉమా మహేశ్వర రావు, కౌన్సిలర్ గండి హరిక స్వామి, లింగోలు పండు, ఆర్‌డియస్ ప్రసాద్, సుదా చిన్న ఆకుల సూర్యనారాయణ మూర్తి, సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి శ్రీనివాస్, పడాల నానాజీ, డా కొప్పుల నాగ మానస, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని ఆత్రేయపురం గ్రామం సెంటర్ నందు వాహనాలు తనిఖీ చేయుచుండగా ఆత్రేయపురం గ్రామానికి చెందిన బండి దిలీప్ అనే ఆసామి ఆటో ఆపగా, సదర వ్యక్తి మద్యం సేవించి ఆటో నడుపుతున్నందున సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆత్రేయపురం ఎస్ఐ ఎస్ రాము తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఆత్రేయపురం ఎస్ రాము సూచించారు.

కోడిపందెపు రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని అంకంపాలెం గ్రామ శివారున కోడిపందాలు ఆడుతున్నారన్ని ఆత్రేయపురం పోలీసు స్టేషన్‌కి సమాచారం రావడంతో ఎస్సై రాము తన స్టేషన్ సిబ్బందితో పేకాట ఆడుతున్న శిబిరంపై మెరుపు దాడి చేయగా కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను వారి వద్ద నుండి రెండు కోళ్లను, రెండు కత్తులు, రూ.1100లు నగదును స్వాధీనపరచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆత్రేయపురం ఎస్ రాము తెలిపారు.

ఊపందుకున్న చికెన్ అమ్మకాలు

విశాలాంధ్ర, కొవ్వూరు. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ సేల్స్ భారీగా పడిపోయాయి. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ అమ్మకాలు పడిపోయాయి. ఫలితంగా ధరలు భారీగా దిగొచ్చాయి. అయితే, ఇది అంతా వారం రోజుల క్రితం సంగతి. ఎండలు పెరగటంతో బర్డ్ ఫ్లూ తగ్గుముఖం పట్టింది. దీంతో చికెన్ కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో చికెన్ ధరలు పెరిగాయి. ఆదివారం కావటంతో మాంసం ప్రియులు చికెన్ షాపులకు క్యూ కట్టారు. దీంతో గత నెల రోజులుగా వెలవెలబోయిన చికెన్ షాపులు కలకలాడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కేజీ చికెన్ ధరపై రూ.50 వరకు పెరిగింది. అయితే, ఇన్ని రోజులుగా చికెన్‌కు దూరమైన మాంసాహారాలు ధరలను పట్టించుకోకుండా కొనుగోలు చేస్తున్నారు. కొనుగోళ్లు ఇలానే కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్లు నిపుణులు చెబుతున్నారు. వారం క్రితం కిలో రూ.850లు ఉన్న మటన్ రేటు ప్రస్తుతం కిలో రూ.1000కి చేరింది. చేపల ధరల విషయంలోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. కిలో రూ.50 నుంచి 100 పెరిగింది., బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో గత నెలరోజులుగా దాదాపు 50 శాతం కంటే ఎక్కువగానే సేల్స్ పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ క్రమంలో డిమాండ్ పెరగడంతో మటన్, ఫిష్ సేల్స్ పెరిగినట్లు చెబుతున్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి చర్యలు : శ్రీనివాసవర్మ

విశాలాంధ్ర -భీమవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మత్స్యకారుల సంక్షేమంతోపాటు మత్స్యరంగ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆదేశించారు. బీజేపీ నర్సాపురం పార్లమెంట్ కార్యాలయంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ను నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు మైల వసంతరావు, పాలకవర్గం సభ్యులు కలసి జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెరైన్ సైడ్ ఉన్న సంత మార్కెట్లులో ఫిష్ మార్కెట్లలో వసతులు కల్పించడం, పంచాయతీరాజ్ చెరువుల వేలంలో 10 శాతం పరిమితి దాటకుండా చర్యలు తీసుకోవాలని, వలలు, నావలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని ఎస్టి, ఎస్సి, బీసీలకు 75 శాతం పెంచాలని, మత్స్యకార సొసైటీ గ్రామల్లో మత్స్యకార కమ్యూనిటీ హాల్ నిర్మించడం, మత్స్యకారుల వాహనాలు ఇచ్చే రాయితీ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్రకి అందజేశారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి జిల్లా మత్స్యశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజా బాలాజీ, డైరెక్టర్లు పూడిమూడి శ్రీనివాస్, బేరం శ్రీరామచంద్రమూర్తి, బెజవాడ నాగరాజు, తిరుమాణి సీతామాలక్ష్మి ,మోకా ఆంజనేయులు , జంపా అప్పారావు, కోపనాతి శ్రీనివాసరావు, పిడిగే జోసెఫ్ , వైదాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం 23 మందికి గాయాలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక నగర పంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో పిచ్చికుక్క హల్‌చల్ చేసింది. నంది వీధి, పెద్దవీధి, నెయ్యిల పేట, మందుల కాలనీలలో శనివారం 8 మందిని కరిచింది. ఆదివారం ఉదయం మరో 15 మందిని కరిచింది. వీరందరూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి ఎటువంటి అపాయం లేదని ఎప్పటి కప్పుడు చికిత్సను అందించి, పరిశీలిస్తున్నామని స్థానిక వైద్యులు తెలుపుతున్నారు. పిచ్చికుక్క ఎక్కడ నుంచి వచ్చి ఎప్పుడు అపాయం తలపెడు తుందో అని జనం భయ భ్రాంతులకు గురవుతు న్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యలపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కాంట్రాక్ట్ లెక్చరర్స్ 475 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం వినతిపత్రం అందజేశారు. పిఠాపురంలో పర్యటించిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు చాలా ఏళ్లుగా ప్రభుత్వ కళాశాల పనిచేస్తున్న లెక్చరర్ సర్వీస్ రెగ్యులరై జేషన్ ప్రక్రియ పూర్తి చేయకుండా గత ప్రభుత్వం పట్టించుకోలేదని కాంట్రాక్ట్ లెక్చరర్ సమస్యలపై తక్షణమే పరిష్కరించేలా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేలా కృషి చేయాలని మంత్రి మనోహర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాకర చిన్నబ్బాయి, జి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహన చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో నూతన మోటారు వాహన చట్టం ప్రకారం పెంచిన జరిమానాలు గురించి అవగాహనా ఆదివారం అవగాహన కల్పించారు. కాకినాడ ట్రాఫిక్-1 సీఐ ఎన్. రమేష్, ట్రాఫిక్ ఎస్సై బి శంకర్‌రావు, కాకినాడ టౌన్ హాల్ సెంటర్ నందు 'మోటార్ సైకిల్స్ నడిపేవారికి, సామాన్య ప్రజలకు హెల్మెట్ వాడకం పైన, కొత్త ట్రాఫిక్ ఫైన్స్‌పై అవగాహన నిర్వహించినారు. మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధిస్తామన్నారు.ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని. వాహనములను అతి వేగముగా నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలుగు ప్రమాదాలు గురించి వారికి వివరించడం జరిగిందన్నారు. హెల్మెట్ ధరించిన వాహన దారులతో, హెల్మెట్ ధరించని వాహనదారులకు, హెల్మెట్ ధరించుట వలన ఉపయోగాలు తెలియజేయడంతో, హెల్మెట్ ధరించని వాహనదారులు హర్షద్వానాలతో అభినందనలు తెలియజేసినారు. నూతన మోటారు వాహన చట్ట ఉల్లంఘనలపై పెంచిన జరిమానాలు గురించి అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీస్ వారికి వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఏ ఉద్యోగైనా పదవి విరమణ తప్పదు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి తహసీల్దార్ కే రాజ్యలక్ష్మికి ఆదివారం పదవీ విరమణ సత్కారం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు రెవెన్యూ సిబ్బంది అధికారులు రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు తహసీల్దార్ బంధువులు స్నేహితులు హాజరై పదవి విరమణ సత్కార కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆదివారనాడు దేవరపల్లి కరుటూరి ఫంక్షన్ హాల్‌లో జరిగిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ ఏ ఉద్యోగి కైనా పదవి విరమణ తప్పదు పదవిలో చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. రాజ్యలక్ష్మి గత 40 సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు ఎదిగి ప్రజల మనలను, ప్రభుత్వ అధికారుల మనలను పొందారన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కే రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ డిపార్ట్మెంట్లో 40 సంవత్సరాలు పాటు పని చేశానని తాను పనిచేసిన చోట స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులు ఎంతో సహకారం అందించారన్నారు. ముఖ్యంగా దేవరపల్లి మండల ప్రజలు గత సంవత్సరం నెల నుండి తనకు పూర్తిస్థాయిలో సహకరించటం వలన ఏ విధమైన ఇబ్బందులు లేకుండా తహసీల్దారుగా పదవి నిర్వహించానన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్యలక్ష్మి వెంకటరెడ్డి దంపతులను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, రెవెన్యూ అధికారులు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ తెలుగుదేశం పార్టీ నాయకులు కొయ్యలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, గన్నమనే హరికృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, పెనుమత్స సుబ్బరాజు, ముళ్ళపూడి దొరాజి చౌదరి. ఉప్పులూరి రామారావు, చిలక రాజేష్, పిన్నమనేని సత్యనారాయణ ,కొండపల్లి దొరయ్య కోయిలమూడి సుధారాణి, జనసేన నాయకులు దాసరి శేషారావు, కాళ్ళ వెంకటరత్నం, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోలు అనిత పండు, లక్ష్మి వెంకటేశ్వరరావు, భాష రవి , శేషమ్మ రాజ్యలక్ష్మి కి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు

శారీరక దృఢత్వానికి నైపుణ్యం తోడైతే విజయాలు

విశాలాంధ్ర - సామర్లకోట : ఇటీవల తాజాగా హైదరాబాదులో జరిగిన జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడలో 70 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా, 60 ప్లస్ విభాగంలో రన్నర్స్‌గా విజయం సాధించిన ప్రముఖ సీనియర్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు, సెవెన్ హిల్స్ పేపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ పసల పద్మ రాఘవరావుకు సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం సాయంత్రం ఘనంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టుదల శారీరక దృఢత్వానికి నైపుణ్యం తోడైతే అన్ని విషయాల్లో విజయం సాధించడం సాధ్యమని సీనియర్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు, పెద్దాపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, రాష్ట్ర కార్మిక నాయకులు, వైసీపీ నాయకులు దవులూరి సుబ్బారావులు జడ్పీ ఎంపిహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ వైద్యులు, సామర్లకోట మున్సిపల్ మాజీ చైర్మన్ డా చందలాడ అనంత పద్మనాభం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. 70 వసంతాలు పైబడినా పూర్తి ఆరోగ్యంతో అనేక జాతీయ, అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొని విజయం సాధించడం పసల ఆరోగ్యంతో పాటు పట్టుదల ఎంతో సహకరిస్తుందన్నారు. వందేళ్ళ వయసు వరకు ఇదే ఆరోగ్యంతో క్రీడల్లో పాల్గొని మరిన్ని విజయాలు సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు తెచ్చి పెట్టాలని ఆశాబావం వ్యక్తం చేశారు.

విగ్రహా ప్రతిష్ఠకు వితరణ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని పాండవులపాలెం గిరిజన గ్రామంలో శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయం విగ్రహం ప్రతిష్ట కార్యక్రమం పాల్గొన్న ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్సీపి ముదునూరి మురళి రాజు అనంతరం అమ్మవారినీ దర్శనం చేసుకొని మురళి రాజు చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు రూ.10000లు విరాళం అందజేశారు. అలాగే ధర్మ వరంలో వేములూరి మణికంత గృహప్రవేశం కార్యక్రమా నికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దొడ్డి సత్యనా రాయణ, నాగేశ్వరరావు, చామరి శ్రీను, సీతారామరాజు, రాంబాబు, లోంద బాబు, మేక చంటిబాబు, దేవ లక్ష్మణ్, విత్తనాలు నాగేశ్వరరావు, దేవ వీరబాబు, కొల్లుబోయిన ఏసుబాబు, సతీష్ రాజు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, మరియు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.